క్లుప్తంగా

ఘనంగా లక్ష్మీగణపతి ఆలయ వార్షికోత్సవం


ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కొత్తపల్లి: వాకతిప్పలో ఉన్న శ్రీలక్ష్మీగణపతి ఆలయ మొదటి వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో భారీ అన్నసమారాధన చేశారు.

స్టేషన్ మాస్టర్ల సంఘం కార్యదర్శిగా లక్ష్మి



అనంతలక్ష్మిని అభినందిస్తున్న యూనియన్ ప్రతినిధులు

సామర్లకోట: అఖిల భారత స్టేషన్ మాస్టర్ల సంఘం సామర్లకోట బ్రాంచి కార్యదర్శిగా పి.అనంతలక్ష్మి ఎన్నికయ్యారు. స్థానిక రైల్వే స్టేషన్‌లో సూపరింటెండెంట్‌గా పని చేస్తున్న అనంతలక్ష్మి కార్యదర్శిగా ఎన్నిక కావడంతో స్టేషన్ మేనేజరు ఎం.రమేష్, సిబ్బంది అభినందించారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి


కొమరగిరిలో ఇళ్ల నిర్మాణ పనులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ భాస్కరరావు

కొత్తపల్లి: ఇళ్ల స్థలాలు మంజూరైన లబ్ధిదారులు నిర్మాణాలు త్వరితగతిన చేపట్టాలని ఎంపీడీఓ భాస్కరరావు అన్నారు. కొమరగిరిలోని లే అవుట్‌ను బుధవారం ఆయన పరిశీలించారు. ఇళ్ల నిర్మాణ లబ్ధిదారులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ లే అవుట్లు స్థలాలు ఉన్న లబ్ధిదారులకు సంబంధించి 2,397 ఇళ్ల నిర్మాణానికి గానూ సుమారు 450 ఇళ్ల నిర్మాణం పూర్తి కాగా, శ్లాబ్ దశలో 150, గోడల నిర్మాణం దశలో 100, పునాది దశలో 450 ఉన్నాయన్నారు. వీటి నిర్మాణాలను త్వరిత గతిన చేపట్టాలని ఆదేశించారు. ఆయనతో హౌసింగ్ ఏఈ శ్రీనివాస్ ఉన్నారు.

గుర్రపుడెక్కలో కళేబరాలు


హుస్సేన్‌పురం గోదావరి కాలువ కాలిబాట వంతెన వద్ద గుర్రపుడెక్కలో పశు కళేబరం

సామర్లకోట: కెనాల్ రోడ్డులో ఉన్న హుస్సేన్‌పురం కాలిబాట వంతెన వద్ద గోదావరి కాలువలో గుర్రపు డెక్క పెరిగి పోయింది. దాంతో ఇతర ప్రాంతాల నుంచి చనిపోయి వచ్చిన పశువుల కళేబారాలు గుర్రపు డెక్కలో చిక్కుకుని దుర్వాసన వ్యాపిస్తోంది. గోదావరి కాలువలో నీటినే వాడకానికి ఉపయోగిస్తున్నామని, ఈ కళేబరాల వల్ల అంటువ్యాధులు వ్యాపించే అవకాశం ఉందని వైఎస్సార్ సీపీ మండల ఎస్సీ సెల్ కన్వీనర్ అచ్చారావు ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే గుర్రపు డెక్కను, దానిలో చిక్కుకున్న మృతదేహాలను తొలగించాలని డిమాండ్ చేస్తున్నారు.

పందుల వేట ప్రారంభం


పందులను తరలిస్తున్న వాహనం

సామర్లకోట: మున్సిపాలిటీ పరిధిలో బుధవారం తెల్లవారు జాము నుంచి పందుల వేట ప్రారంభించారు. ఇటీవల పందుల పెంపకందారులతో అనేక పర్యాయాలు సమావేశాలు నిర్వహించి జనవరి 20 తరువాత పట్టణంలో పందులు తిరగడానికి వీలు లేదని చైర్ పర్సన్ గంగిరెడ్డి అరుణ, వైస్ చైర్మన్ ఉబా జాన్ మోజెస్ ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. అయినా పందుల సంచారం ఆగకపోవడంతో గత నెలాఖరులో జరిగిన కౌన్సిల్ సమావేశంలో సభ్యులు ఈ విషయమై అధికారులపై ధ్వజమెత్తారు. ఈ మేరకు భారీ పోలీసు బందోబస్తు మధ్య పట్టణ పరిధిలో వార్డుల్లో ఉన్న పందులను పట్టుకుంటున్నారు. పట్టుకున్న సుమారు 300 పందులను ఆరు వాహనాలలో జంగారెడ్డిగూడెం సమీపంలోని అటవీ ప్రాంతాల్లో విడిచి పెడుతున్నట్లు శానిటరీ ఇన్‌స్పెక్టరు పి.శ్రీనివాసరావు తెలిపారు.

పార్టీ విజయానికి రథసారథులుగా మారాలి


గృహసారథుల శిక్షణ కార్యక్రమంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే పెండెం దొరబాబు


శిక్షణ కార్యక్రమానికి హాజరైన గృహసారథులు, కన్వీనర్లు

- ఎమ్మెల్యే పెండెం దొరబాబు
- సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులకు శిక్షణ

పిఠాపురం: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయానికి, ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మళ్లీ గెలిపించేందుకు రథసారథులుగా మారాలని గృహసారథులను ఎమ్మెల్యే పెండెం దొరబాబు పిలుపునిచ్చారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద బుధవారం నిర్వహించిన పిఠాపురం మండల గృహసారథుల శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ టీడీపీ తమ ప్రభుత్వంపై లేనిపోని బురద చల్లాలని ప్రయత్నిస్తోందని, దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా అభివృద్ధి చేసి చూపిస్తే వేరే దారి లేక తప్పుడు ఆరోపణలకు దిగుతోందన్నారు. ప్రజా సంకల్ప యాత్ర చేసి ప్రజల సమస్యలను కళ్లారా చూసి, విని వాటి పరిష్కారానికి హామీలు ఇచ్చి ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం 95 శాతానికి పైగా హామీలన్నీ నెరవేర్చారన్నారు. ప్రజా సంకల్పయాత్రకు ధీటుగా యువగళం పేరుతో లోకేష్ పాదయాత్ర చేయాలని ప్రయత్నించడం పులిని చూసి నక్కవాతలు పెట్టుకునే చందంగా ఉందని ఎద్దేవా చేశారు. సీఎం వైఎస్ జగన్ ప్రజా సంకల్పయాత్ర చేసినప్పుడు టీడీపీ పరిపాలనలో ప్రజలు ఎన్నో ఇబ్బందులు, కష్టాలు పడి ఉండడంతో ఆ సమస్యలన్నీ ప్రజలు జగన్ దృష్టికి తీసుకొచ్చారన్నారు. వాటిని జగన్ సమర్థవంతంగా పరిష్కరించగలిగారన్నారు. కానీ ఇప్పుడు లోకేష్ పాదయాత్రలో ఒక్క సమస్య కూడా చెప్పుకునే నాథుడు లేక సొంతంగా డబ్బులు ఇచ్చి 600 మందిని వెనకేసుకుని తిరుగుతున్నారు తప్ప ఎవరూ మాకు ఈ సమస్య ఉందని ఆయన వద్దకు వెళ్లినవారు లేరన్నారు. జనం ఎవరూ రాక వ్యాన్‌లోనే ఉండిపోవలసిన పరిస్థితి లోకేష్‌కు దాపురించిందన్నారు. జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా చేయడమే ధ్యేయంగా సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు ఇప్పటి నుంచి కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం చేసిన అభివృద్ధిని వివరించి ఓటు బ్యాంకును పెంచే దిశగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. సీఎం వైఎస్ జగన్ ప్రవేశపెట్టి అమలు చేస్తున్న వలంటీర్, గ్రామ సచివాలయ వ్యవస్థలు దేశంలోనే ఒక చరిత్ర సృష్టించాయని, అది ప్రజలకు తెలిసినప్పటికీ ఇంకా వివరించి ఒక్క ఓటు కూడా ప్రతిపక్షానికి వెళ్లకుండా పనిచేయాల్సిన ఆవశ్యకత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ సందర్భగా గృహసారథులు నిర్వహించాల్సిన విధులు ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కన్నాబత్తుల కామేశ్వరరావు, మండలపార్టీ అధ్యక్షుడు జవ్వాది నాయుడు, జడ్పీ వైస్ ఛైర్మన్ బుర్రా అనుబాబు, సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు నడిగట్ల చింతలరావు, ఉలవల భూషణం, పలువురు కన్వీనర్లు, గృహసారథులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

సంక్షేమ పాలన జగన్‌తోనే సాధ్యం

- హౌసింగ్ ఛైర్మన్ దవులూరి
- మాధవపట్నంలో గడప గడపకూ


మాధవపట్నంలో ప్రజలకు పథకాలు వివరిస్తున్న దవులూరి దొరబాబు

సామర్లకోట: సీఎం జగన్ గతంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా ప్రజా సంక్షేమ పాలన అందిస్తున్నారని, అటువంటి ముఖ్యమంత్రిని దీర్ఘకాలం ఉండేలా చూసుకోవలసిన బాధ్యత మన చేతిలోనే ఉన్నదని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. బుధవారం సాయంత్రం మండల పరిధిలో మాధవపట్నం గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ పాలనపై అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. గత ప్రభుత్వానికి జగన్‌మోహన్‌రెడ్డి పాలనకు ఉన్న తేడాను లబ్ధిదారుల నుంచి సమాచారం సేకరించారు. ప్రజల వద్దకే పాలన అందేలా సచివాలయ వ్యవస్థ, వలంటీరు వ్యవస్థను ఏర్పాటు చేసి ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచిన ముఖ్యమంత్రి జగన్ అని వారికి వివరించారు. పింఛను పంపిణీ విధానంపై ఆరా తీశారు. గ్రామ సర్పంచ్ మేడిశెట్టి సుగుణమ్మ, మార్కెట్ కమిటీ ఛైర్మన్ మేడిశెట్టి వీరభద్రం, ఎంపీటీసీ సభ్యులు మేడిశెట్టి దుర్గాదేవి, కృష్ణార్జునరావు, ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వెంటే మేమంతా

అన్నవరం ట్రస్ట్‌బోర్డు సభ్యురాలు సూర్యావతి


ఎమ్మెల్యే దొరబాబును సత్కరిస్తున్న సూర్యావతి

పిఠాపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో ప్రజా సంక్షేమమే పరమావధిగా పని చేస్తున్న ఎమ్మెల్యే పెండెం దొరబాబు వెంటే తామంతా ఉంటామని అన్నవరం ట్రస్ట్‌బోర్డు సభ్యురాలిగా నియమితులైన రాయుడు సూర్యావతి అన్నారు. ఆమెను ట్రస్ట్‌బోర్డు సభ్యురాలుగా నియమించినందుకు బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పెండెం దొరబాబును కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దొరబాబు మాట్లాడుతూ పార్టీకి కట్టుబడి పనిచేసే ప్రతి ఒక్కరికి న్యాయం జరుగుతుందని ఆయన తెలిపారు. రాయుడు చిన్న, ఉలవల భూషణం తదితరులు పాల్గొన్నారు.

ఏఎన్‌ఎం పోస్టుల భర్తీకి చర్యలు


ఆస్పత్రిని పరిశీలించిన డీఎంహెచ్‌ఓ శాంతిప్రభ

సామర్లకోట: జిల్లా పరిధిలో అర్బన్ హెల్త్ సెంటర్లలో ఖాళీగా ఉన్న ఏఎన్‌ఎం పోస్టులను త్వరలో భర్తీ చేయనున్నట్లు డీఎంహెచ్‌ఓ డి.శాంతిప్రభ తెలిపారు. బుధవారం స్థానిక గణపతినగరం, అయోధ్యరామపురంలోని అర్బన్ హెల్త్ సెంటర్లను ఆమె తనిఖీ చేశారు. ఈ మేరకు ప్రతి బుధవారం చిన్నారులకు ఇచ్చే వ్యాధి నిరోధక టీకాలను ఆమె పరిశీలించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో సుఖ ప్రసవాలు జరిగేలా దృష్టి కేంద్రీకరిస్తున్నట్లు చెప్పారు. గర్భిణులు, చిన్నారులకు నూరు శాతం టీకాలు వేసి, మందులు ఇచ్చి వాడించాలన్నారు. మా ఆస్పత్రి అనే నమ్మకంతో ప్రజలు వచ్చేలా సిబ్బంది విధులు నిర్వర్తించాలన్నారు. అయోధ్యరామపురం అర్బన్ హెల్త్ సెంటర్‌లో సదుపాయాలు, మందులు సమృద్ధిగా ఉన్నా సిబ్బంది కొరత వల్ల రోగులు ఇబ్బంది పడుతున్నారని 31వ వార్డు కౌన్సిలర్ పాగా సురేష్ కుమార్ డీఎంహెచ్‌ఓకు వివరించారు. జిల్లా వ్యాప్తంగా ఒకేసారి సిబ్బంది నియమాకం ఉంటుందని చెప్పారు. అర్బన్ హెల్త్ సెంటర్ల అత్యవసర పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని డిప్యూటేషన్ చేస్తామని తెలిపారు.

పేకాడుతున్న ఏడుగురి అరెస్టు

సామర్లకోట: స్థానిక పాత్రులపేటలో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై బుధవారం పోలీసులు దాడి చేశారు. ఈ మేరకు ఏడుగురిని అదుపులోకి తీసుకుని రూ.6,750 స్వాధీనం చేసుకున్నట్లు సీఐ కె.దుర్గాప్రసాద్ తెలిపారు. సీఐ ఆధ్వర్యం లో జరిగిన దాడుల్లో ఎస్సై టి.సునీత, సిబ్బంది పాల్గొన్నారు.

● కలల పంటా.. భద్రం కన్నా..


కాకినాడ-రాజమహేంద్రవరం బస్సు ఫుట్‌బోర్డుపై వేలాడుతున్న విద్యార్థులు

కారణమేదైనా కళాశాలల రాకపోకల సమయాల్లో బస్సులకు వేలాడుతూ విద్యార్థులు ప్రయాణం చేయడం స్థానికంగా నిత్యం కనిపించే దృశ్యాలు. రాజమహేంద్రవరం, ఏడీబీ రోడ్డులో ఉన్న వివిధ కళాశాలలో చదువుకునే విద్యార్థులు వీరు. బస్సులో ముందూ, వెనుకా ఖాళీ కనిపిస్తున్నా వారికి ఆనందాన్నిచ్చేది ఫుట్‌బోర్డు ప్రయాణమే. వయసూ.. స్నేహం.. సరదా.. హీరోయిజం.. కొంత ఆకతాయితనం వీరిని పురిగొలిపే అంశాలు. ఇంట్లో అమ్మానాన్నలు తనకోసం ఎదురుచూస్తారన్న చిన్న ప్రేమపాశం ఏ మాత్రం ఉన్నా వీరు అలా ప్రమాదాలకు ఎదురు వెళ్లరన్నది నిజం. ఆర్టీసీ, పోలీసు అధికారులు ఈ బాలల భవితను దృష్టిలో ఉంచుకుని ఎంత చెప్పినా వీరు మారరు అని విసుగు చెందక.. అందులో వారి బిడ్డ ఉంటే అనే భావనతో నిత్యం నిఘా ఉంచాల్సిన బాధ్యత ఎంతైనా ఉంది. – సామర్లకోట

సాగునీటి సమస్యలకు సత్వర చర్యలు


అధికారులకు సూచనలు ఇస్తున్న ఆర్డీవో బీవీ రమణ

కరప: రబీలో సాగునీటి లభ్యత తక్కువగా ఉన్న నేపథ్యంలో ఐదు అంచెల విధానంలో నీటిని సరఫరా చేయాలని నిర్ణయించినట్టు ఆర్డీఓ బీవీ రమణ వివరించారు. మండలంలోని అరట్లకట్ట గ్రామంలో సాగునీటి ఎద్దడితో సాగు సమస్య ఎదుర్కొంటున్న పొలాలను రెవెన్యూ, వ్యవసాయ, జల వనరుల శాఖ అధికారులతో రైతులతో కలసి ఆర్డీవో బీవీ రమణ పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు సాగునీటి సమస్య ఎదుర్కొంటున్న ప్రాంతాల్లో పర్యటించి సాగు సమస్యను అధిగమించాల్సిన చర్యలపై మండలాధికారులతో చర్చించినట్టు తెలిపారు. ముఖ్యంగా సాగునీటి సరఫరాకు సంబంధించి ప్రస్తుతం ఉన్న మూడంచల విధానంలో కాకుండా ఐదు అంచెల విధానంలో సాగునీరు సరఫరా చేయాలని నిర్ణయించినట్టు తెలిపారు. సాగునీటి ఎద్దడి వల్ల మండల పరిధిలో సుమారు 250 ఎకరాల్లో మాత్రమే సాగు జరుగుతుండగా, అందులో 20 ఎకరాల్లో సాగునీటి ఎద్దడి సమస్య ఉన్నదని వ్యవసాయ అధికారులు ఆర్డీవోకు వివరించారు. సదరు సమస్యలపై ఆర్డీవో మాట్లాడుతూ తక్షణం కలెక్టర్‌తో మాట్లాడి సాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపట్టనున్నట్టు తెలిపారు. ఆర్డీవో వెంట తహసీల్దార్ పి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

జగనన్న ఇళ్ల నిర్మాణంపై డీఎల్‌డీఓ సమీక్ష

కాకినాడ రూరల్: మండలంలోని జగనన్న లే అవుట్లలో గృహ నిర్మాణాలపై మండల పరిషత్ కార్యాలయంలో డీఎల్‌డీఓ నారాయణరావు బుధవారం సమీక్షించారు. ఎంపీడీఓ శ్రీనివాస్, గృహ నిర్మాణ శాఖ ఏఈ నాగభూషణం, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు హాజరుకాగా తిమ్మాపురం, నేమాం, పండూరు గ్రామాల్లోని జగనన్న లే అవుట్లలో గృహ నిర్మాణాల ప్రగతిపై సమీక్షించి, వేగవంతం చేయాలన్నారు.

స్టిక్కర్లపై తుది హెచ్చరిక


చోదకుడితోనే స్టిక్కర్ తీయిస్తున్న ఎస్సైలు ఏసుబాబు, విజయబాబు

కాకినాడ క్రైం: పోలీస్, ప్రెస్, ఇలా వివిధ విభాగాల స్టిక్కర్లతో ద్విచక్రవాహనాలు నడుపుతున్న వారికి పోలీసులు వార్నింగ్ ఇచ్చారు. నగరంలో వివిధ కూడళ్లలో ఇలా స్టికర్లు ఉన్న వాహనాలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ట్రాఫిక్ డీఎస్పీ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో 15 వాహనాలను పట్టుకున్నారు. వాటిలో 7 వాహనాలు పోలీస్, 6 ప్రెస్ మరో 2 రెవెన్యూ స్టిక్కర్లతో ఉన్నాయి. కాకినాడలోని టూ టౌన్ ట్రాఫిక్ పీఎస్ వద్ద బుధవారం రాత్రి చోదకులను పిలిచి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఇప్పటికే పలు మార్లు హెచ్చరించినా మార్పు రాలేదని చెబుతూ ఇదే ఫైనల్ అంటూ చోదకుల తీరుపై అసహనం వ్యక్తం చేశారు. లైసెన్సు రద్దుకు సిఫార్సు చేసి చట్టపరమైన చర్యలు చేపడతామని హెచ్చరించారు. అనంతరం తమ వాహనాలపై స్టిక్కర్లను వారి చేతే తీయించి ద్విచక్రవాహనాలు అప్పగించారు. ఎస్పీ రవీంద్రనాథ్‌బాబు సమక్షంలోనే కౌన్సెలింగ్ ఇచ్చారు. అనంతరం ఎస్పీ సాధారణ తనిఖీల్లో భాగంగా కాకినాడ టూ టౌన్ పోలీసు స్టేషన్‌ను పరిశీలించారు.

సీఎంగా మళ్లీ జగన్‌కే పట్టం కట్టాలి

- సంక్షేమ పథకాలపై ప్రజలను చైతన్యపర్చండి
- కన్వీనర్లు, గృహ సారథుల సమావేశంలో దవులూరి దొరబాబు


సమావేశంలో మాట్లాడుతున్న హౌసింగ్ ఛైర్మన్ దొరబాబు

పెద్దాపురం: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే ప్రజలు పట్టం కడతారని ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. మండలంలోని కట్టమూరులో బుధవారం సాయంత్రం జె.తిమ్మాపురం, కట్టమూరు గ్రామాల సచివాలయ కన్వీనర్లు, గృహ సారథుల సమావేశం సర్పంచ్ దిమ్మల పుష్పరత్నం అధ్యక్షతన జరిగింది. దొరబాబు మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీల కంటే ఎక్కువ సంక్షేమాన్ని అమలు చేస్తున్న ఘనత సీఎం జగన్‌దేనన్నారు. ఆ సంక్షేమ పథకాలను వివరించి ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని వారికి సూచించారు. 'మా నమ్మకం నువ్వే జగనన్న' అని నినాదంతో ప్రజల్లోకి వెళ్లి ప్రభుత్వం పట్ల ప్రజల్లో ఉన్న నమ్మకాన్ని 2024 ఓటు రూపంలో వైఎస్సార్ సీపీ విజయానికి కృషి చేయాలని దొరబాబు పిలుపునిచ్చారు. వలంటీర్లకు ఇబ్బందులు ఉండకూడదనే గృహ సారథుల నియమించినట్టు తెలిపారు. జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, పీఏసీఎస్ అధ్యక్షుడు చల్లా చినవీర్రాజు, గృహ సారథుల మండల కన్వీనర్ గోపు మురళి, నల్లల గోవిందు, కుండల దుర్గాప్రసాద్ మాట్లాడుతూ కరోనా పరిస్థితుల్లోనూ సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత సీఎం జగన్‌దే అన్నారు. అనంతరం గృహ సారథుల విధులు, బాధ్యతలపై అవగాహన కల్పించారు. ఎంపీటీసీలు నల్లల సూర్యకుమారి, బత్తిన రమణమ్మ, ప్రసాద్, మండల కో–ఆప్షన్ సభ్యులు శేషకుమారి, వ్యవసాయ సలహా మండలి సభ్యులు ఏలేటి అనంతలక్ష్మి, లక్కాకుల నానాజీ, సుందరెడ్డి రాజు, వైవీకే సాయి పాల్గొన్నారు.


మేడపాడులో గృహ సారథులను ఉద్దేశించి మాట్లాడుతున్న దొరబాబు

జగనన్నతోనే రాష్ట్ర భవిష్యత్

సామర్లకోట: పేదల సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్న సీఎం జగన్‌తోనే రాష్ట్ర భవిష్యత్ ఆధారపడి ఉందని హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. గృహ సారథులు, సచివాలయ కన్వీనర్ల శిక్షణలో భాగంగా బుధవారం జి.మేడపాడులో నిర్వహించిన శిక్షణలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా గృహ సారథులకు ప్రత్యేకంగా కిట్లు అందజేస్తున్నట్టు తెలిపారు. గృహ సారథులు వైఎస్సార్ సీపీ ప్రతినిధులుగా ఇంటింటా పరిచయం చేసుకోవాలన్నారు. ఏ ముఖ్యమంత్రీ చేయని విధంగా సీఎం సంక్షేమ పాలన అందిస్తున్నారని ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు తెలిపారు. పార్టీ నాయకుడు, మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ మోరంపూడి శ్రీరంగ నాయకులు, మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ మోరంపూడి రమేష్, సర్పంచ్ పటాని దేవి, ఎంపీటీసీ సభ్యులు ముమ్మన వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి బషీర్ బీబీ ఉర్స్ ఉత్సవాలు

ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి


బషీర్ బీబీ దర్గా

కొత్తపల్లి: పొన్నాడలో వేంచేసి ఉన్న బషీర్‌బీబీ ఔలియా(బంగారు పాపమ్మ) 68వ ఉర్స్ ఉత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభంకానున్నాయి. ఉత్సవాలకు స్థానిక ముజావర్లు అన్ని ఏర్పాట్ల పూర్తి చేశారు. ఉత్సవాలకు హాజరయ్యే భక్తులు తప్పనిసరిగా కోవిడ్ నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకుంటున్నామని వారు తెలిపారు. ఈ ఉత్సవాలు ఆదివారం వరకూ నిర్వహించనున్నారు. శుక్రవారం ఈ ఉత్సవాలును ప్రజాప్రతినిధులు ప్రారంభిస్తారన్నారు. ఈ ఆలయానికి రాష్ట్రం నలుమూలల నుంచి హిందూ, ముస్లింలు హాజరవుతారు. మూడు రోజుల పాటు ఉండేందుకు వీలుగా ఉత్సవ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లను చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పిఠాపురం సీఐ ఆర్‌కే శ్రీనివాస్ ఆధ్వర్యంలో కొత్తపల్లి, పిఠాపురం, పిఠాపురం రూరల్, గొల్లప్రోలు పోలీసులు మూడురోజుల పాటు ఎస్సై రామలింగేశ్వరరావు పర్యవేక్షణలో బందోబస్తు ఉంటుందన్నారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలు, రంగులతో సుందరంగా అలంకరించారు.

ప్రమాదం జరిగితే బాధ్యులెవరు!


వీవీఎస్ విద్యాసంస్థల సమీపంలో జారి పడిన రాయి


అధిక రాళ్ల లోడుతో వెళుతున్న లారీ

- కొండరాళ్లతో ప్రయాణిస్తున్న లారీలు
- పట్టించుకోని అధికారులు

కొత్తపల్లి: పిఠాపురం– ఉప్పాడ రోడ్డులో నిబంధనలు అతిక్రమించి అధిక లోడు కొండరాళ్లతో లారీలు ప్రయాణిస్తున్నాయి. దీంతో వాహనచోదకులు, పాదచారులు భయాందోళనకు గురవుతన్నారు. అధికలోడు వేయడమే కాకుండా అతివేగంగా వాహనాలను నడుపుతుండడంతో రాళ్లు రోడ్లపై జారి పడుతున్నాయి. స్థానికంగా వీవీఎస్ విద్యా సంస్థల సమీపంలో బుధవారం వేగంగా వెళుతున్న లారీ నుంచి ఒక్కసారిగా బండరాయి పడింది. త్రుటిలో ప్రమాదం తప్పింది. పాఠశాల, కళాశాల విడిచిపెట్టడంతో ఒక్కసారిగా విద్యార్థులు బయటకు వస్తున్న సమయంలో లారీపై నుంచి పెద్ద రాయి పడింది. అది చూసిన విద్యార్థులు పరుగులు తీశారు. దీంతో విద్యార్థులు ఎలాంటి ప్రమాదం జరగలేదు. ఇలా పలుమార్లు రాళ్ల కింద పడుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా అమీనాబాద తీరప్రాంతంలో నిర్మిస్తున్న మేజర్ హార్బర్ నిర్మాణానికి సంబంధించి వాల్ నిర్మాణానికి ఈ రాళ్లను తరలిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి లారీలో అధిక లోడులు తరలించకుండా చర్యలు తీసుకోవాలని ప్రయాణుకులు, పాదచారులు, స్థానికులు కోరుతున్నారు.

క్రీడలపై యువతకు ఆసక్తి అవసరం


విజేతలకు బహుమతులు అందజేస్తున్న బీజేపీ నాయకులు

పెద్దాపురం: గ్రామీణ యువత క్రీడలపై ఆసక్తిని కనపర్చాలని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేటుకూరి సూర్యనారాయణ రాజు అన్నారు. మండలంలోని తిరుపతి పార్టీ యువమోర్చ ఉపాధ్యక్షుడు మొయిళ్ల రవి ఆధ్వర్యంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా పీఎం నరేంద్రమోడి జిల్లా స్థాయి కబడ్డీ టోర్నీ విజేతలకు బుధవారం బహుమతులు అందజేశారు. సర్పంచ్ మొయిళ్ల కృష్ణమూర్తి అధ్యక్షతన జరిగిన సభలో సూర్యనారాయణ రాజు మాట్లాడుతూ మోదీ పిలుపు మేరకు టోర్నీ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అనంతరం తిరుపతి, సామర్లకోట, కొత్తూరు, మల్లిసాల గ్రామాల కబడ్డీ జట్లకు మొదటి నాలుగు స్థానాలకు బహుమతులు అందజేశారు. యువమోర్చా అధ్యక్షుడు అనపర్తి వెంకటేష్, ఆదిత్య, రాంబాల వెంకటేష్, బీవీకే రాజు ఆయా గ్రామాల క్రీడాకారులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కాకినాడ సిటీ: నగరంలోని జగన్నాథపురం, అన్నమ్మఘాటీ విద్యుత్ ఉప కేంద్రాల పరిధిలో శుక్రవారం ఉదయం 9.30 గంటల నుంచి 12.30 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని డీఈఈ జి.ప్రసాద్ బుధవారం తెలిపారు. 33/11కేవీ జగన్నాథపురం విద్యుత్ ఉపకేంద్రంలో 11 కేవీ, చొల్లంగిలో 33/11 కేవీ, అన్నమ్మఘాటీ విద్యుత్ ఉపకేంద్రంలోని 11 కేవీ తారకరామనగర్ ఫీడర్ పరిధిలో లైన్ మరమ్మతులు చేస్తున్నామన్నారు. ఈ పనుల నిర్వహణకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఆయన తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.